# ముదిరాజ్‌లను మోసం చేసింది కాంగ్రెస్సే..

- టికెట్లు అమ్ముకున్న రేవంత్‌రెడ్డి
- ఓటమి భయంతో బీఆర్‌ఎస్ శ్రేణులపై దాడులు
- ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ కృషి
- హైదరాబాద్ నడిబొడ్డున ముదిరాజ్ భవనం
- పండుగ సాయన్న విగ్రహాల ఏర్పాటు
- రానున్న రోజుల్లో 300 ముదిరాజ్ భవన్‌ల నిర్మాణం
- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- కోస్గిలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం
- పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శేఖర్

కొడంగల్, నవంబర్ 18 : ముదిరాజ్ బిడ్డలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ, మోసకారి రేవంత్ అని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. శనివారం కోస్గి మున్సిపల్ కేంద్రంలో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ తదితరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో బండ ప్రకాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదిగే దిశగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ బిడ్డనైన నన్ను పార్లమెంటు నుంచి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా కేబినెట్ హోదాను కల్పించినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని పెంచేలా సొసైటీలు, మత్స్యశాఖలతో అధికారాన్ని కట్టబెట్టినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లోని కోకాపేటలో 5 ఎకరాల్లో ముదిరాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు రూ.3కోట్లతో మహబూబ్‌నగర్‌లో, రూ.2కోట్లతో వనపర్తిలో, రూ.కోటితో కొడంగల్‌లో, రూ.30లక్షలతో కోస్గిలో ముదిరాజ్ భవన్ నిర్మాణాలకు భూమి పూజలు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట, మెదక్, జహీరాబాద్‌తోపాటు కొమురవెల్లి, యాదాద్రి, వేములవాడ, భద్రాచలం తదితర పుణ్యక్షేత్రాల్లో ముదిరాజ్ భవన్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. 70 ఏండ్ల కాలం నుంచి ఎవరికీ తెలియని ముదిరాజ్‌ల ముద్దుబిడ్డ పండుగ సాయన్న విశిష్టతను చాటేలా మహబూబ్‌నగర్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేసి ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని పెంచినట్లు తెలిపారు. షాద్‌నగర్, పరిగి, చేవెళ్ల లాంటి ప్రాంతాల్లో కూడా విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 300 విగ్రహాలను ఏర్పాటు చేసేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ ముదిరాజ్ బిడ్డ పోలీస్ కిష్టప్ప విగ్రహాన్ని నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా ఆయన బిడ్డను డాక్టర్ చదివించినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ బిడ్డలైన కాసాని జ్ఞానేశ్వర్, ఎర్ర శేఖర్, నీలం మధురాజ్‌లను మోసం చేసింది రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. ముదిరాజ్ బిడ్డకు రావాల్సిన ఎమ్మెల్యే టికెట్‌ను మోసం చేసి మార్కెట్‌లో అమ్ముకున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవానికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి ముదిరాజ్ బిడ్డలు అండగా నిలిచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

### కుల వృత్తులను ప్రోత్సహించింది సీఎం కేసీఆర్

అంతరిస్తున్న కుల వృత్తులకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేసినట్లు మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మత్స్య సహకార సంఘాల ఏర్పాటుతో పాటు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేయడంతో పాటు ప్రత్యేకంగా వాహనాలను కూడా అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌ల అభివృద్ధిని పట్టించుకోలేదని.. తద్వారా ముదిరాజ్‌లు అన్నింటా వెనుకబడ్డారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో కూడా ముదిరాజ్‌లను పెద్దపీట వేసే దిశగా సీఎం ప్రత్యేకంగా కృషి చేయనున్నారని.. ఈ అవకాశాన్ని చేజార్చుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీకి భారీగా ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### ముదిరాజ్‌ల ఆత్మగౌరవం పెంచేలా..

సీఎం కేసీఆర్ వచ్చిన తరువాతే ముదిరాజ్‌ల ఆత్మగౌరవం పెంచేలా ఎన్నో కార్యక్రమాలు రూపుదిద్దుకున్నట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో ముదిరాజ్ బిడ్డలకు ఎక్కువ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట మునుగుతామన్నారు. రేవంత్‌రెడ్డి జిమ్మిక్కుల రాజకీయమని.. ఆయన చెప్పేది ఒకటి.. చేసేది ఒకటన్నారు. సొంత పార్టీలోనే ఆశించిన వారికి టికెట్లు ఇవ్వకుండా ఎక్కువ మొత్తంలో డబ్బు సంచులు అందించిన వారికి టికెట్‌లను అమ్ముకున్నారన్నారు. గతంలో కూడా ఓటుకు నోటు కేసులో ప్రధానంగా ఉన్నాడని అటువంటి వ్యక్తిత్వం ఉన్నవాడు ప్రజా సంక్షేమానికి పాటుపడతాడంటే ఏవిధంగా నమ్మకం ఉంటుందని ప్రశ్నించారు. ప్రజల మధ్యకు వెళ్లి ఓట్లు అడిగే దమ్ము రేవంత్‌కు లేదని.. అందుకే ప్రతిసారి ఏదో ఒక జిమ్మిక్కును ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఎన్నికల్లో ఓడిపోతానని భయంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలపై, వాహనాలపై దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మూడు సార్లు దాడులకు పాల్పడ్డారన్నారు. కరోనా సమయంలో రేవంత్‌రెడ్డి ఎక్కడికి పోయాడని, ప్రాణభయంతో హైదరాబాద్‌కు పరిమితమైనట్లు గుర్తుచేశారు. రెండు సార్లు కరోనా వచ్చిన సమయంలో ప్రజల మధ్య ఉండి వైద్య సేవలందించినట్లు తెలిపారు. అందుకే ప్రజలు ఎంతో ఆదరాభిమానాలు కురిపిస్తున్నారని పేర్కొన్నారు. మరోసారి అవకాశం ఇస్తే.. ఇంతకు రెట్టింపుగా ప్రజాసేవ చేసి ప్రజలకు మరింత చేరువవుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### రాజకీయాన్ని వ్యాపారం చేసిన వ్యక్తి రేవంత్

రాజకీయాన్ని కూడా రేవంత్ వ్యాపారంగా మలిచాడని, నమ్ముకున్నవారిని మోసం చేసి కాంగ్రెస్ టికెట్‌లను ఎక్కువ వేలం పాట పాడిన వారికి అమ్ముకున్నారని మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం అలవాటు ఉన్నవాడు కాబట్టి అన్నింటినీ వ్యాపారంగా చేసే గుణం రేవంత్‌కు ఉందన్నారు. కొడంగల్‌లో అవకాశం కల్పిస్తే.. కొడంగల్‌ను కూడా అమ్మడం ఖాయంగా పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు ఇప్పటికైనా మేల్కొని ప్రజా నాయకుడైన పట్నం నరేందర్‌రెడ్డిని గెలిపించుకుంటే అన్నింటా సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. కాంగ్రెస్‌కు 11 సార్లు అవకాశం కల్పిస్తే ఎటువంటి అభివృద్ధిని చేసిందో చూడటం జరిగిందన్నారు. కర్ణాటకలో ఎన్నికల్లో 5 గ్యారంటీల హామీ ఇచ్చి అధికారం వచ్చాక నేడు కాంగ్రెస్‌లో ఏ ఒక్క గ్యారంటీ అమలు కావడం లేదన్నారు. స్వయంగా కన్నడ ప్రజలే కొడంగల్‌కు వచ్చి వారి బాధను వెల్లడించుకున్నారని తెలిపారు. ముదిరాజ్‌ల ఆత్మగౌరవం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యపడుతుందని.. ముదిరాజ్‌లు ఒక్కతాటిపై నిలిచి పట్నం నరేందర్‌రెడ్డికి మరో అవకాశాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియోద్దీన్, ఎన్నికల పరిశీలకుడు కిషన్ రావు, మున్సిపల్ చైర్మన్ శిరీష, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

## నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లిలో 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు**

**శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**

ఆమనగల్లు, నవంబర్ 18 : ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛా వాతావరణంలో, స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శనివారం రాత్రి ఆమనగల్లు, కడ్తాల్, మైసిగండిలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పారామిలిటరీ, సీఐఎస్ఎఫ్ బలగాలు, అడిషనల్ డీసీపీ రాంకుమార్, క్రైం అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐలు వెంకటేశ్వర్లు, శివప్రసాద్, ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్ ఎస్ఐలు బలరాం, శ్రీనివాస్, హరిశంకర్‌గౌడ్ స్థానిక పోలీసులతో కలిసి డీసీపీ నారాయణ రెడ్డి పట్టణం వీధులు, హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం డీసీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో 15 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు సర్కిల్‌లో పారామిలిటరీ పోలీస్ బృందం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు శంషాబాద్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. అభ్యర్థులెవరైనా మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని డీసీపీ తెలిపారు. ఆమనగల్లుకు ఎన్నికలకు సంబంధించి అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డిని స్పెషల్ అధికారిగా సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర నియమించినట్లు తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఏదైనా సమస్య ఉంటే 9490612459కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## బీఆర్‌ఎస్ పాలనలోనే మైనార్టీల సంక్షేమం

- మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే..
- కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దు
- ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో హోం మంత్రి మహమూద్‌అలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్, చిత్రంలో హోం మంత్రి మహమూద్‌అలీ తదితరులు

షాద్‌నగర్, నవంబర్18 : దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ సంక్షేమానికి నిధులను ఖర్చు చేస్తున్నారని హోం మంత్రి మహమూద్‌అలీ అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలోనే మైనార్టీ సంక్షేమం సాధ్యమైందనే విషయాన్ని ముస్లిం సోదరులు గ్రహించాలన్నారు. శనివారం రాత్రి షాద్‌నగర్‌లో నిర్వహించిన ముస్లిం మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి వై.అంజయ్యయాదవ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఏనాడు కూడా ముస్లింల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, వారి పాలనలో పేదరికం పెరిగిందే తప్పా మన బతుకులు మారలేదని చెప్పారు. ముస్లింలు అంటే కాంగ్రెస్ అని చెప్పుకునే నాయకులు.. ముస్లింలకు ఏమి చేశారో చెప్పాలన్నారు. కేవలం ముస్లింల ఓట్ల కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీ మాట్లాడేది తప్పా, మన బాగు కోసం కాదనే విషయాన్ని తెలంగాణ మైనార్టీలు గుర్తించాలని సూచించారు.

### అన్ని రంగాల్లో రాణిస్తున్న మైనార్టీలు

కాంగ్రెస్ పాలన ఉందంటే హైదరాబాద్ వంటి నగరాల్లో అల్లర్లను సృష్టించి ప్రజల మధ్య ఘర్షణలను ప్రోత్సహించి రాజకీయాలు చేసేవారని.. నేడు ఆ పరిస్థితి లేదని.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ మైనార్టీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. అన్ని మతాలకు, కులాలకు దీటుగా అభివృద్ధి సంక్షేమ నిధులను కేటాయిస్తూ ముస్లింల ఎదుగుదలకు కృషిచేస్తున్నారన్నారు. మైనార్టీల కోసం గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందని, ప్రభుత్వం విదేశాల్లో చదివే విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థిక సహాయం చేస్తుందని వివరించారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధితో రాణించేందుకు ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ నాయకుల మోసపు మాటలను పట్టించుకోవద్దని కోరారు.

### అన్ని విధాల అండగా ఉంటా..

ముస్లిం మైనార్టీలకు అన్ని విధాల అండగా ఉంటానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అంజయ్యయాదవ్ అన్నారు. ముస్లింలను ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో బాలికల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ఏర్పాటుతో పాటు ఈద్గా అభివృద్ధికి రూ.43 లక్షల నిధులను వెచ్చించామని పేర్కొన్నారు. షాద్‌నగర్ షాదీ ఖానా నిర్మాణానికి రూ.50 లక్షలతోపాటు చౌదరిగూడ, నిర్దవెల్లి, కొందుర్గులలో నూతనంగా షాదీఖానాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఆయా గ్రామాల్లో శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణానికి నిధులను వెచ్చించామని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి యువతి కుటుంబానికి షాదీముబారక్, మహిళలు, వితంతువులు, వృద్ధులకు ఆసరా పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించామని వివరించారు. అభివృద్ధి చేసిన పార్టీని ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న హోం మంత్రి మహమూద్‌అలీని ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లాఖాన్, తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, బీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు సయ్యద్ ఇబ్రహీం, ఎంపీపీలు ఖాజా ఇద్రీస్, వై.రవీందర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ సాదిక్, కౌన్సిలర్లు సర్వర్ పాషా, మహ్మద్ గౌస్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్ జానీ, మోబిన్ ఘోరీ, ఎజాజ్ అడ్డు, అస్రఫ్, షబ్బీర్‌లాలా, ఉస్మాన్, సిరాజ్, జమాల్‌ఖాన్, ఆసిఫ్ ఉన్నారు.